కథాకాలం : 1987

# గల్లీలో మల్లెపువ్వు

ఒకామె పలకరించింది --
సుబ్బారావుని!

సందు మొగలో నిలబడ్డ వీధి దేవతలా కనపడిందా ఆఆడది అతనికి. దేవతలకి గుడి జైలు అవునో, కాదో తెలీదు సుబ్బారావుకి. ఎందుకంటే సుబ్బారావు మనిషే. నూటికి నూరు శాతం మనిషి. ఇంకా చెప్పాలంటే సగటు మనిషి. కాని చదరంగంలో శకటుకుండే గొప్పకూడ ఏ మాత్రం అబ్బించుకోలేకపోయిన సీదాసాదా మనిషి.

సగటు మనిషికి గర్ల్‌ఫ్రెండూ, ప్రేయసీ, దేవతా, దెయ్యం అన్నీ నిజభార్యే కావాలి. సుబ్బారావుకి అతని భార్య పైన చెప్పిన అవతారాలన్నీకాక అదనంగా మరోటి కూడా అయ్యింది. ఆవిడ అతనికి లెక్కల మాస్టారు. సుబ్బారావుకి చిన్నప్పటినించీ లెక్కలు రావు. అందుచేత ఎంత అప్పు చెయ్యాలో, ఎంత తీర్చాలో, ఎంత తాగి తిని తందనాలా

డాలో, ఎంత కొంపలో ఖర్చులకి పెళ్ళాం చేతిలో పొయ్యాలో ఈ లెక్కలేమీ తెలీవు.

అంచేత ప్రతిసారి జీతం రోజున లెక్కలు తప్పుతూ ఉంటాడు. అతని బెటర్ హాఫ్ లెక్కల చిక్కుల్లో బిగుసుకున్న అతన్ని కోప్పడుతుంది.... కేకలేస్తుంది.... ఈసడిస్తుంది .... ఉరోసుకుంటానంటుంది .... నా పీక పిసికి పారెయ్యండి పీడ విరగడవు తుందని సలహాయిస్తుంది.... పుట్టింటికి పోతానని బెదిరిస్తుంది....

కానీ అతన్ని పలకరించదు.

పలకరింతలూ, పులకరింతలూ అతని జీవిత అకౌంటులో సత్తు రూపాయలు.

అదిగో అలాటి సుబ్బారావుని —

ఓ ఆడది పలకరించింది !!

సందు మొగలో నిలబడ్డ వీధి దేవతలా కనపడిందా ఆడది అతనికి. దేవతలకి గుడి జైలు అవునో కాదో అతనికి తెలియదు, కాని ఈ సందు మొగలో వీధి దేవతకి ప్రపంచం మొత్తం ఒక విశాలమైన జైలు కావును, అందుకే వీధివెలుగుని లైటు లేని లైటు స్తంభం కింద చీకటి భోంచేస్తున్నచోట ఆ ఆడది 'రావుగారూ మిమ్మల్నే ఆగండి' అంటూ పలకరించింది.

ఆగాడు.

పొరపాట్న ఆగినట్టున్నాను. నన్ను కాదేమో అనుకున్నాడు.

పక్కన ఓ జిడ్డి మనిషి కూరగాయలసంచిని ఓ చేత్తో సిగరెట్టు మరో చేత్తో మోస్తూ వగరుస్తూ కాళ్ళీడ్చుకుంటూ మధ్య మధ్య ఉమ్ము కుంటూ పోతున్నాడు. అతను 'రావు' అవునో కాదో సుబ్బారావుకు తెలియదు. కొంపదీసి ఆవిడ పిలుస్తున్న రావుగారు మీరేనా - లేకపోతే నేనేనా?! అని అతడిని అడుగుదా మనుకున్నాడు. మళ్ళా వద్దని ఊరుకున్నాడు. ఆవిడనే అడిగేస్తే పోలా?

''ఏవండి నన్నేనా పిలిచింది?'' వీధిదేవతని నేరుగా అడిగేశాడు.

''ఆ మిమ్మల్నేనండి బాబూ ఓ మాట. ఇలా రండి" అని చెయ్యూపి పిలిచింది.

''నేను రావునని మీకెలా తెలుసు?"

"రావుకాకపోతే మూరితి సరా రండి." దారినపొయ్యే దానయ్యని నన్నిలా పిలుస్తోందేమిటీ ఆడమనిషి అని విస్తుపోకుండా వీధి దేవతకి దొరికిన వీధి భక్తుళ్ళా ఆమెవెంట అడుగులేసాడు.

చిత్రం ...ఆవిడ ఆవిడ అని ఈఎవెడెవర్నో మనసులో సంబోధించు కుంటున్నారుగానీ ఈవిడ ఆవిడ కాదు. పాపం చిన్నపిల్లే. మరి రెండు మూడేళ్ళు పోతే తన కూతురు ఇంతకి ఎదుగుతుంది. అప్పుడు దానికి పెండ్లి చెయ్యండని ఇంటిదగ్గర లెక్కల మాస్టారు కోప్పడుతుంది. ఎల్లాగో లెక్కలు సర్దేసి పెళ్ళి చేసేస్తాడు. కానీ ఆ వచ్చే అల్లుడికి లెక్కలు వస్తాయో రావో?!

అతను ఆలోచనల నుంచి - తేరుకోకపోను వీధిదేవత మళ్ళీ పలక రించకపోతే.

"ఆ రౌడీ ముండాకొడుకు సూస్తున్నాడు. మేడమీంచి. ఒకటే పోకిరీచూపులు. అందుకే మిమ్మల్ని ఇలా సీకట్లోకి తీసుకొచ్చాను'' అని ఆమెనవ్వింది.

ఇంతకీ ఏమిటీవిడ వరస? ఊఁ... అర్థమయ్యింది సుబ్బారావుకి.

"వస్తావా అని మీరే అడుగుతారనుకుంటిని. సరే నేనే అడగతన్నా ....ఒస్తారా?"

"ఎంత?'' అనేశాడు సుబ్బారావు. అలా ఎలా అనగలిగానా అని ఓ ఆశ్చర్యం నిలేసింది. ఎంత లేదన్నా మగాణ్ణి అని సిగ్గుపడ్డాడు.

"మోడెస్టీ దై నేమిజ్ వుమన్" అని స్వగతం చెప్పుకున్నాడు పరిహారంగా.

సుబ్బారావు ప్రశ్నకి వీధిదేవత ముఖంమీద స్కార్లెట్ లెటర్‌ముద్రంది, అది సుబ్బారావు గమనించాడు.

వీధి దేవత ఆడదాన్నని ఏనాడో మరచిపోయినట్లు 'పది హేను' అని స్వయంగా రేటు పలికింది.

చటుక్కున సుబ్బారావుకి తను సుబ్బారావునని గుర్తొచ్చింది. లెక్కలు రావని గుర్తొచ్చింది. ఈ వయసుదేకాక పోయినా ఇంకో రెండుమూడేండ్లు చిన్నదే అయినా ఓ కూతురుందని గుర్తుకొచ్చింది. ఇంటి దగ్గర లెక్కల మాస్టారూ గుర్తుకొచ్చింది.

'రాను' అనేసి గబుక్కున వెనక్కి తిరిగాడు.

పడిదొరికిన వి ఐ పిని వదులుకోవడం ఇష్టంలేని దొంగలా ఆమె

సుబ్బారావుని వేగంగా అనుసరించింది.

వెళ్లిపోతున్న సుబ్బారావుని వెనకనించి వాటేసుకుని గట్టిగా తన వైపు తిప్పుకుని బలంగా ముద్దు పెట్టుకుని చీకట్లో మాయమైంది.

"చీకట్లో సడేమియా" దారినపోతున్న, ఓ మనిషి అంతా గమ నించి ఓర్చుకోలేక ఓ విసురు కసిగా సుబ్బారావుమీద విసిరిపోయాడు.

"పరువు బజారుకెక్కింది" అని సుబ్బారావు అనుకోలేదు. లాభం అనుకున్నాడు జేబులుతడుముకున్న తరువాత తనకి దక్కిన ముద్దు తలచుకుని.

ఎందుకంటే —

జేబులో అంతకు ముందుండాల్సిన పర్సులేదు.

లాభం ఎందుకంటే—

ఆ పర్సులో ఉండాల్సింది లేదు. అందులో సొత్తంతా భార్యఫోటో ఒక్కటే.

సుబ్బారావు మరల రోడ్డెక్కి అడుగులేస్తూ ఓజోకు గుర్తు తెచ్చుకున్నాడు.

వెనకటికో పెద్దమనిషి పర్సుపోయింది. పర్సుపోయిందని రోడ్డుమీద ఉన్నట్లుండి గోలచేశాట్ట. చుట్టూవున్నవారు రంగంలోకురికి పారిపోతున్న ఓ కుర్రాణ్ణి పట్టుకుని వాడిచేతిలోవున్న పర్సు లాక్కున్నారట. సదరు పెద్దమనిషికి పర్సువప్పజెప్పి ఊరుకోకుండా ఆ కుర్రాడిని అంతలో దెబ్బలేయడం మొదలెడితే ఆ కుర్రాడు స్పృహతప్పి పడిపోయాట్ట.

"పర్సులో లెక్క చూసుకోండి మాస్టారూ అంతా ఉందో లేదో కేడీగాడివని మేం పడతాం లెండి ఎలాగూ" అంటే ఆ పెద్దమనిషి సదరు పీరుడిని స్పృహతప్పిన కుర్రాడిని పట్టించుకోకుండా "ఆ... కంగారేమీ లేదులెండి....పోయింది పర్సు కదా ఈ సందు మొగలో దొంగలున్నారని తెలియాలని అలా అరిచానుగానీ ఆ పర్సులో ఏముంది నాబొంద- ఏమీ లేదు" అనేసి చక్కాపోయాట్ట.

ఆ పర్సులో కొన్ని డబ్బులంటూ ఉంటే ఆ కుర్ర సన్నాసి తిన్న దెబ్బలకి - ఓ నీతి మోతాదులో న్యాయం జరిగినట్లే. అసలుకే చిల్లు గవ్వ లేదు కాబట్టి పాపం వాడికి అంతా కష్టం నష్టం.

ఇలా ఆలోచించుకుంటూ అడుగులేస్తూన్నాడు సుబ్బారావు. ఇందాకటి జిడ్డి మనిషి ఇంకా కూరగాయల సంచీ చేత్తో సిగరెట్టు ఇంకో చేత్తో మోస్తూ వగర్చుతూ కాళ్ళీడ్చుకుంటూ మధ్య మధ్య ఉమ్ముతూ మళ్ళీ తటస్థపడ్డాడు. సుబ్బారావు అతన్ని దాటేసాడు.

అంతలో అక్కడ కూడ ఒక సందుమొగ ఎదురయ్యింది. అక్కడ కూడా రోడ్డుమీద గుడ్డివెలుగుంది. సందుమొగలో లైటులేని లైటు స్తంభం ఉంది. రోడ్డు వెలుగుని సందు చీకటి భోంచేసే ఏర్పాటు ఉంది. అరె చిత్రం! అక్కడా ఓ ఆడది నిలబడి ఉంది.

గుర్తుపట్టేశాడు సుబ్బారావు.

ఇందాకటి పీధిదేవతే....

ముద్దురూపంలో మిగిలిన లాభంగురించి సగటు సుబ్బారావుకి మంచి కుషీ కలిగింది.

"కాశీ పర్సు కొట్టేసి కంగుతిన్నావా బిడ్డా" అని వెక్కిరించ బుద్ధి కూడా అయింది.

"నిన్నే! ఇలారా!" వీధిదేవత హుకుం జారీచేసింది.

"నన్నేనా?" అని తటపటాయించలేదు ఈసారి సుబ్బారావు. "ఆ అదిలింపు నామీదే. అందుమీద ఇక్కడెవ్వరికీ హక్కులేదు" అని చాటుతున్నట్టు వెళ్ళి నిలబడ్డాడు.

వీధిదేవత పెనంమీద పేలాలల్లే పేలింది.

"చిల్లికాణీ పర్సులో లేదుకాని వస్తావా అంటే ఎంతని అడుగుతావా బాడికోశ్" అంటూ పర్సు ముఖాన కొట్టినట్టు విసిరింది.

"అమ్మోరంత భూదేవంత మా తల్లి నీకు ఆలి వుండగా చిరుతిళ్ళు కావాల్నా ....చక్కంగా ఏలుకో" అంటూ జలకడినేసి గల్లీలోకి మాయ మయ్యింది వీధిదేవత.

వంగి పర్సుతీసుకుని సుబ్బారావు రోడ్డెక్కాడు.

అతనికి సంతోషంగా ఉంది. తను ఓ బజారు మనిషి కవ్వింపుని తట్టుకొన్నానని.

అతనికి బాధగా ఉంది - తను ఏమీ లేనివాణ్ణని ఆ బజారు మనిషి కనిపెట్టేసిందని.

అతనికి కోపంగా ఉంది - మొన్న చేసిన అప్పు పేకాటలో తగలెయ్యకుండావుంటే ఇందులో కొంత డబ్బు మిగిలి ఇప్పుడీ ఆపదలో

ఈ బజారుమనిషికి తన నీతి బలం తెలిసేదని.

అలా ఆలోచించుకొంటూ పర్సు తెరిచి అందులో తనకి అలవాటైన శూన్యాన్ని వెతుక్కొనబోతే పెళ్ళాం ఫొటో చేతికి తగిలింది. నిజమే వీధిదేవత కాని బజారుమనిషి చెప్పినట్టు నగా నట్రా లేని భూదేవిగాని, అమ్మోరుగాని ఫొటో తీయించుకుంటే ఎలా ఉంటుందో అలా ఉంది. ఆ ఫొటోలో తన లెక్కల మాస్టారు, ఆమె నొసటిమీద రూపాయి కాసుకి ఇంకా విలువపడిపోలేదు.

కానీ - సుబ్బారావు ఊహించని మరో నీతికూడా పర్సులో ఓ మూల నలిగిపోయి దర్శనమిచ్చింది. ఐదు రూపాయలనోటు - నలిగి కమలిన పువ్వులాటిది.

"సక్కంగా ఏలుకో" అన్న వీధిదేవత మాటలు గుర్తుకొచ్చాయి. సుబ్బారావుకి ఆ ఆర్తి అర్థమయ్యి - అచేతనుడై నుంచుండిపోయాడు. ఎంతసేపో అతనికే తెలియదు మళ్ళీ మామూలు మనిషైనాక --

ఈసారి లాభం అనుకోలేదు సుబ్బారావు. ఆ నోటు మార్చి మల్లెపూలు కొనుక్కొని ఇంటికి వెళ్ళాలని తీర్మానించుకున్నాడు!